# గుండెతడి

## చిలకూరి దేవపుత్ర

ఉదయం ఎనిమిది గంటలయింది.

బస్టాండు రద్దీగా వుంది.

కొన్ని బస్సులు అప్పుడే వచ్చినందువల్ల ప్రయాణీకులు హడావిడిగా ఎక్కుతున్నారు.


కొన్ని బస్సులు బయల్దేరేందుకు సిద్ధమవుతూ వున్నాయి.

ఎంతకీరాని బస్సులకోసం ప్లాట్‌ఫాం మీద ఎదురుచూస్తున్న జనం దిక్కుతోచక అటూఇటూ తిరుగుతూ వున్నారు. వాళ్లలో చెంగావి రంగు చీరలో అదే రంగు జాకెట్టు వేసుకొని వున్న ఆవిడ పేరు కళ్యాణి. ఆమె మొహంలో కొంచెం విసుగు కనబడుతూ వుంది. మాటిమాటికీ వాచీని చూసుకుంటూ వుంది.

ఆమె కొత్తపల్లి బస్సుకోసం ఎదురు చూస్తూ వుంది. ఈమధ్యనే ఆమె తూర్పు గోదావరి జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు బదిలీ చేయించుకుని వచ్చింది. ఇప్పుడు కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోషల్ అసిస్టెంట్‌గా చేరడానికి వెళుతోంది.

''మొదటిరోజు కదా. నేనూ వస్తాను పద!'' అన్నాడు తన భర్త పొద్దున. అతను మునిసిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో టీచరు.

''ఎందుకు ప్రసాద్! నాకేం భయమా? ఇప్పటికే పది సెలవులు వాడేశావు. మళ్లీ ఇప్పుడు సెలవు ఎందుకు పెట్టాలి?'' అంటూ




వారించింది తను.

''నీకు ఉద్యోగం కొత్త కాకున్నా, ఇక్కడి మనుషులూ, పరిసరాలు కొత్తకదా కళ్యాణీ!''అన్నాడు ప్రసాద్.

''నేనేం దేశంకాని దేశానికి వెళ్ళడం లేదుగా! మా రాజమండ్రి అయినా ఈ అనంతపురమయినా తెలుగు ప్రాంతా

## ప్రియుడికోసం వ్రతమా?



**ము**ద్దుల ప్రియుడు షాహిద్‌కు సంబంధించిన వార్తలు పత్రికల్లో గుప్పుమనక పోతే పాపం కరీనాకు కునుకు పడనట్టుంది. 'మిడ్ డే'లో ముద్దుసీన్లు వచ్చిన తరువాత ఈ మధ్యనే మరో మేగజైన్‌లో కరీనా ప్రియుడికి దగ్గరయ్యేందుకు వ్రతం చేస్తున్నట్టు పుకార్లొచ్చాయి. ఈ విషయంపై కరీనా పెద్దగా స్పందించలేదు కూడా నట. ఎవరైనా కలుసుకోవాలనే కదా వుంటారు. దానికోసం ఏమైనా చేస్తారు అని సెలవిచ్చిందట. ఇంతకీ వ్రతమేంటి అని అడిగితే, వ్రతాలు, పూజలు నేనేమీ చేయట్లేదని చెబుతోంది. గ్లామర్ రహస్యం గురించి అడిగితే, అందరి మాదిరి కాస్తంత తింటూ కడుపుమాడ్చుకునే తత్వం కాదు నాది. కావాల్సినంతా తినేస్తాను. కాదంటే ఎక్కువగా వాటర్ తీసుకుంటాను. అదే నా గ్లామర్ రహస్యమని సెలవిస్తోంది. అసలు విషయమేంటంటే కరీనా ప్రియుడు షాహిద్ కోసం చేసే వ్రతం లీక్ అయితే చాలామంది క్యూలో వున్నారుట బాలీవుడ్‌లో ప్రియుళ్ళను కలుసుకోవడానికి వ్రతం చేసేవాళ్లు.

లేగా! హాయిగా వెళ్తాను. అందులోనూ అలా కొత్త ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లాలన్నా, కొత్త వ్యక్తుల్ని కలవాలన్నా, వాళ్లతో పరిచయం చేసుకోవాలన్నా చాలా థ్రిల్‌గా వుంటుంది. నువ్వు వచ్చావనుకో, దాన్ని నేను మిస్ అవుతాను'' అంది తను.

''నువ్వు ఎవరి మాటా వినవు కదా!'' అన్నాడు ప్రసాద్ నవ్వుతూనే.

''నిజమే వినను. అలా వినేటట్టయితే మా జిల్లాలోనే నాకు బోలెడు సంబంధాలు వచ్చాయి. పెద్దపెద్ద ఉద్యోగాలు చేసే వాళ్లే అంతా. నేనొప్పుకున్నానా? లేదే. మా చిన్నాన్న అనంతపురం నుంచీ మీ సంబంధం తెచ్చారు. నువ్వు నచ్చావు. ఒప్పేసుకున్నాను'' అంది తనూ నవ్వుతూ.

''ఓకే అట్లనే కానీండి కళ్యాణి గారూ! బాగా థ్రిల్ ఫీల్‌కాండి!'' అన్నాడు తన నెత్తిమీద సున్నితంగా మొట్టికాయ వేస్తూ.

''అదిగో కొత్తపల్లి బస్సు వచ్చింది'' అని ఎవరో అంటే చూసింది కళ్యాణి.

ఆలస్యం చేయకుండా బస్సులోకి ఎక్కి కిటికీ పక్కగా కూచుంది. దాదాపు ఇరవైమంది ప్రయాణీకులు ఎక్కారు.

ఒకావిడ పక్కనే కూచుంది. వయసు నలభై ఏళ్లు వుండవచ్చు. మాసి వున్న ముదురాకు పచ్చ చీర కట్టుకుని, రంగు వెలసిన పసుపుపచ్చ రవిక వేసుకుని వుంది. చీరకు అక్కడక్కడా చిరుగులు కన్పిస్తూ వున్నాయి. మనిషి నల్లగా ఉంది. నుదుటి మీద కుంకుమ బొట్టు లేదు. రెండు మూడు రోజుల కిందట దువ్విన జుట్టు కొంత చింపిరిగా కన్పిస్తూ వుంది. కళ్యాణి ఒక్కసారి ఆమెను చూసింది. కూలీపనికి గానూ ఎక్కడికయినా వెళుతోందేమో అనుకుంది.

''ఇది కొత్తపల్లి బస్సే కదా తల్లీ!'' అంటూ అడిగిందామె కళ్యాణిని.

''అవునండీ!'' అంది కళ్యాణి.

''నువ్వు యాడ దిగల్ల తల్లీ?'' అడిగిందామె.

''కొత్తపల్లేనండీ!''

''అట్లనా – ఎవురింటికి పోవల్ల?''

''ఎవరి ఇంటికీ కాదండీ ...'' అంటూ తను ఎందుకు వెళుతున్నదీ వివరంగా చెప్పింది కళ్యాణి.

''అయితే, మా ఊరి బడిలో అయివారమ్మగా జేరతా ఉండావా?'' అంది సంతోషపడిపోతూ.

అవునన్నట్టు తలూపింది కళ్యాణి.

తన పేరును ఆమెకు చెప్పి, ఆమె పేరును అడిగింది కళ్యాణి. 'నాగమ్మ' అని తెలిపిందామె.

బస్సు స్టార్టయి మెల్లిగా కదిలింది.

ఊరు దాటుతున్నట్టే నిండిపోయింది బస్సు. వేషభాషల్ని బట్టి, ప్రయాణీకుల్లో సగానికి పైన టీచర్లు, ఉద్యోగులే ఉన్నట్టున్నారు అనుకుంది కళ్యాణి. ఎన్నికల గురించి వెనకాల ఎవరో మాట్లాడుకుంటున్నారు.

బస్సు స్పీడు అందుకుంది.

''మన సొంతూరు యా ఊరు తల్లీ!'' అడిగింది నాగమ్మ.

'పల్లెటూరి వాళ్లు ఎక్కడున్నా ఒక్కటే – ఎదుటి మనిషివివరాలు తెలుసుకోవాలని ఆసక్తి!'' అనుకుంటూ నవ్వు మొహంతోనే నాగమ్మకి సమాధానం ఇచ్చింది.

''మనకేమన్నా పొలాలున్నాయా తల్లీ''

''ఆఁ ఉన్నాయండీ! రెండెకరాల పొలం ఉంది. దాన్ని మా తాతయ్యా, నానమ్మ వ్యవసాయం చేయిస్తూ ఉంటారు'' అంది కళ్యాణి.

''రెండెకరాలేనా!'' అంది నాగమ్మ.

''ఏం రెండెకరాలు తక్కువా?''

''అంతేకదా – పాప్పు! మీ తాతక, అవ్వకీ తిండికి సరిపోతాదిలే!'' అందామె ఓదార్పుతున్నట్టు.

''అదేంటి నాగమ్మగారూ! అలా అంటారు. మా భూములకు గోదావరి నీళ్లు పారుతాయి. సంవత్సరం పొడుగునా పంటలు పండుతాయి. మావైపు ఎకరా భూమి ఉంటే చాలా స్థితిపరులకిందే లెక్క'' అంది కళ్యాణి, తమ స్థాయి తెలిసిరావాలని. లేకపోతే కూలికెళ్లే మనిషి తమ రెండెకరాల్ని తక్కువ చేసి మాట్లాడుతుందా?

మళ్లీ తనే అంది కళ్యాణి – ''మీకు పొలం ఉందా?'' ఆమె లేదంటుందని ఊహిస్తూ.

''ఉందమ్మా'' అంది నాగమ్మ నిర్లిప్తంగానే. గతుక్కుమంది కళ్యాణి.

''ఎంతుందీ?''

''ఇరవై అయిదెకరాలు'' అంటూ నాగమ్మ చెబుతూంటే షాక్ తిన్నది కళ్యాణి. ''ఏంటీ – ఇరవయ్యి – అయిదెకరాలా?'' అంది నెమ్మదిగా అప్రయత్నంగానే.

''అవునమ్మా! వానలు జూస్తే అగ్గిబడిపాయె. మా దిక్కంతా యాడ జూసినా కరువే! అట్ల జూడమ్మా! యాడన్నా ఇంత పచ్చగడ్డి మొలక ఉండాదేమో!'' అంటూ కిటికీ వైపు చేయి చూపించింది నాగమ్మ.

అప్పుడు చూసింది తను. నిజమే! ఎటు చూసినా ఎర్ర నేలలు బోసిగా ఉన్నాయి. అదే తమ ప్రాంతంలో అయితే దిగంతాల వరకూ పైరుతో కళకళలాడుతూ పొలాలు నిండుగా కన్పిస్తాయి. అంతటా పచ్చదనం పరుచుకుని ఉంటుంది.

నాగమ్మ అంతటితో ఊరుకోలేదు. తన వ్యధనంతా వివరంగా చెప్పసాగింది.

ఒకప్పుడు వాళ్ల బావిలో నీళ్లు పుష్కలంగా ఉండేవనీ, బావికింద పన్నెండెకరాలు సాగు అయ్యేదనీ, ఆరెకరాల్లో చీనీ (బత్తాయి) తోట ఉండేదనీ, తక్కిన విస్తీర్ణం మెట్ట అనీ, అందులో వేరుశెనగ పండించేవారనీ, వానలు ఎగబెట్టడంతో బావి పూర్తిగా ఎండిపోయిందనీ, ముప్పయి వేలు అప్పుజేసి బావిలో బోరు వేయించినా నీళ్లు పడలేదనీ, దాంతో చీనీ చెట్లు కూడా కొట్టేశారనీ, అప్పుడప్పుడు కురిసే వానలకి ఆశపడి అప్పులు చేసి వేరుశెనగ విత్తనాలు వేస్తే, విత్తనాలు నేలపాలయి అప్పులు మాత్రం నెత్తికి వచ్చినాయనీ, రెండేళ్ల కిందట నాగమ్మ భర్త అప్పులవాళ్ల పోరు పడలేక ఆత్మహత్య చేసుకున్నాడనీ, ఇప్పుడూ ఊర్లో బతకలేక తన పెద్దకొడుకుతోపాటు బళ్ళారిలో కూలీ పనులు చేసుకుంటూ ఉన్నానని చెప్పింది.

ఇదంతా చెబుతున్నప్పుడు నాగమ్మ కన్నుల్లోని చెమ్మని కళ్యాణి గమనించకపోలేదు.

''ఊరి బయటేనమ్మా ఇస్కూలు ఉండేది. అదిగో...'' అంటూ కిటికీలోంచే స్కూలుని చూపి – ''బడికీ, ఊరికీ అర్థమైలు ఉంటుంది'' అంది నాగమ్మ.

హైస్కూలు ముందే ఆగింది బస్సు.

''వెళ్తానండీ నాగమ్మగారూ!'' అని చెప్పేసి బస్సు దిగింది కళ్యాణి.

బస్సు వెళ్ళిపోయింది – దుమ్ము రేపుకుంటూ...

నాగమ్మ చెప్పిన విషయాలతో బరువెక్కిన కళ్యాణి మనసు ఇంకా అట్లే ఉన్నది. యాంత్రికంగా స్కూలువైపు అడుగులు వేసింది.

***

కళ్యాణి హెడ్మాస్టరుకు జాయినింగ్ రిపోర్టు ఇవ్వడమూ, టీచర్లందరితో పరిచయమవడమూ అరగంటలో పూర్తయింది.

తర్వాతి పీరియడ్‌లో ఎనిమిదో తరగతి వాళ్లకి క్లాసు తీసుకోవలసిందిగా హెడ్మాస్టరు చెప్పారు. సరేనంది కళ్యాణి.

గంట కొడుతూనే ఎనిమిదో తరగతి గదికి వెళ్లింది తను. దాదాపు యాభైమంది పిల్లలున్నారు. అందులో ఆడపిల్లలు పదిమంది వున్నారు. క్లాసుకి తనని పరిచయం చేసుకుని, పిల్లలందర్నీ ఒక్కొక్కర్నీ లేపి వాళ్ల పేరూ, తల్లిదండ్రుల వివరాలూ అడిగింది. ఆవేళ పాఠానికి బదులు ఇతర విషయాలు చెప్పసాగింది.

అరగంట తర్వాత వాకిట్లో ఒక పిల్లోడు వచ్చి నిలుచున్నాడు. పిల్లలందరూ ఒక్కసారిగా ఆ పిల్లోడివైపు తలలు తిప్పి చూశారు. జిడ్డు కారుతున్న నల్లటి మొహం, మాసిన తెల్లచొక్కా, ఖాకీ నిక్కరూ వేసుకుని వున్నాడు. జుట్టు కొంచెం రేగి ఉంది.

''నువ్వు ఈ క్లాసేనా?'' అడిగింది కళ్యాణి.

''అవును టీచర్'' అన్నాడు వాడు.

''ఇంకేం – రా''

గబగబ వచ్చి రెండో బెంచీ మొదట్లో కూర్చున్నాడు వాడు.


''నీ పేరు?'' అంది కళ్యాణి.

''తిరుపాలు టీచర్!'' అన్నాడు లేచి నిలబడుతూ.

తల్లిదండ్రుల వివరాలు చెప్పమని అడిగిందామె.

అన్నీ చెప్పేస్తూ – తమది వ్యవసాయ కుటుంబ






మనీ, వాళ్ళకి పది ఎకరాల పొలం ఉన్నట్టుగా కూడా చెప్పాడు తిరుపాలు.

"సరే, అంతా బావుంది. ఇందాకా ఎక్కడికెళ్లావు? క్లాస్‌రూంలో పస్తకాలు పెట్టేసి వెళ్లేంత రాచ కార్యాలేమున్నాయి నీకు?" అడిగింది కళ్యాణి, ఆ కుర్రాడినే సీరియస్‌గా చూస్తూ.

వాడు మౌనంగా తలొంచుకుని ఉండిపోయాడు.

"ఏంటా మాటలు రావా?" అంది కొంచెం గట్టిగానే.

"వాళ్ల చేనులో ఎవరో ఈతగడ్డ కొడుతున్నారని తెలిసి, తనకి ఆకలయితాంది అని చెప్పి పోయినాడు టీచర్!" అంటూ తిరుపాలు పక్కనుండే పిల్లోడు చెప్పాడు.

వేళకాని వేళలో ఆకలా? వీడు వొట్టి తిండిపోతులా వున్నాడే అనిపించింది కళ్యాణికి. తను ఇలాంటివి మొదటిరోజే సహిస్తే వాడు మరీ మితిమీరిపోయే ప్రమాదం ఉంది. పిల్లల్లో క్రమశిక్షణ ముఖ్యం అనుకుని –

"నువ్వు అలాగే నిలబడి ఉండు. నీకు అదే శిక్ష" అంది కళ్యాణి.

ఆమెకి 'ఈతగడ్డ' అంటే ఏమిటో బోధపడలేదు. పిల్లల్ని అడిగింది. ఈతచెట్టు కాండం ముదరకముందే దాన్ని గొడ్డలితో పెకలిస్తారనీ, అందులోని లేత కాండం, లేత ఆకులు రుచిగా ఉంటాయనీ, దాన్నే 'ఈతగడ్డ' అంటారని తెలిపారు పిల్లలు.

"టీచర్! కాళ్లు పీకుతుండాయి" అన్నాడు తిరుపాలు మొహాన్ని బాధగా పెట్టుకుని.

"ఏంటీ?" వినబడనట్లుగా అంది కళ్యాణి.

"వాడి కాళ్లు లాగుతున్నాయంట టీచర్!" పక్కనున్న పిల్లోడు చెబుతూ – "నిన్న కూడా క్లాసులో నిలబడుకునే ఉండాడు టీచర్!" అని కూడా చెప్పాడు.

"అంటే నిన్న కూడా వీడు ఇలాగే.." అంటూ ఆపింది కళ్యాణి.

"కాదు టీచర్! నిన్న వీడు అన్నం క్యారియర్ తేలేదు. అందుకు నిలబడ్డాడు" అంటూ చెప్పాడు ఆ పిల్లోడు.

కళ్యాణికి విషయం అర్థంకాక మరింత వివరంగా అడిగింది. అన్నం క్యారియర్ని స్కూలుకు తెచ్చుకోని పిల్లలు మధ్యాహ్నం అవుతూనే స్కూలు ఎగ్గొట్టి ఇళ్లకి వెళ్లిపోతున్నారనీ, ఆ విషయాన్ని పసిగట్టిన హెడ్మాస్టరు ప్రతిఒక్క విద్యార్థి తప్పనిసరిగా క్యారియర్ తెచ్చుకోవాలనీ, అట్లా తెచ్చుకోని వారిని క్లాసులో నిలబెట్టే ఉంచాలని రూలు పెట్టాడని తెలిపారు పిల్లలు.

"మీ హెడ్మాస్టరు మంచివారు కాబట్టి క్యారియర్ తెచ్చుకోని వారిని నిలుచోబెడతానంటారు. నేను ఆయనంత మంచిదాన్ని కాను. రేపట్నుంచి క్యారియర్ తెచ్చుకోకపోతే క్లాసులోకే రానియ్యను. తెలిసిందా?" అంటూ తిరుపాలుని కూచోమంటూ చేత్తోనే సూచించింది.

***

మరుసటిరోజు తను మళ్ళీ ఆ క్లాసుకే వెళ్లింది కళ్యాణి. పాఠం మొదలుపెట్టబోయేముందు, పిల్లలందర్నీ ఓసారి విహంగ దృష్టితో చూసింది. రెండో బెంచీలో తిరుపాలు కనిపించాడు. "క్యారియర్?" అంది కళ్యాణి. 'తెచ్చావా?' అన్న అర్థం స్ఫురించేలా.

"ఊc.. టీచర్!" అంటూ పక్కనే వున్న క్యారియర్ని చూపాడు తిరుపాలు. అది సత్తుది. జానెడు ఎత్తుంది. అక్కడక్కడా నొక్కులు పడింది.

"వెరీగుడ్!" అంటూ పాఠం చెప్పడానికి ఉద్యుక్తురాలవుతూ చేతిలో ఉన్న పెన్నుతోనే కూచోమని సంజ్ఞ చేసింది కళ్యాణి.

పిల్లలందరూ శ్రద్ధగా పాఠం వింటుంటే కళ్యాణికి తృప్తిగా అన్పించింది.

ఈలోగా గంటకొట్టారు.

"ఇద్దో పిల్లలూ – భోజనాలు అయ్యాక క్లాసులోకి వచ్చి అల్లరి చేయకూడదు తెల్సిందా!" అని చెప్పేసి సమాధానంకోసం చూడకుండా తన నోటు పుస్తకాన్ని తీసుకుని వెళ్లిపోయింది.

టీచర్స్ రూంలో ఉన్న తన క్యారియర్ని తీసుకుని భోంచేయడానికి వెళ్తూంటే "మేడం! కాస్త పెన్ను ఇస్తారా! లెటరు మీద అడ్రసు రాయాలి" అడిగాడు రామన్న అయ్యవారు. అప్పుడు చూసుకుంది వ్యానిటీ బ్యాగ్‌ని. "సారీసార్! ఎక్కడో పెట్టేశాను" అని అనేంతలో జ్ఞాపకం వచ్చింది – క్లాస్ రూంలో టేబులు మీద పెట్టినట్టు.

ఎవరికైనా చెప్పి తెప్పిద్దామా అని వరండాలోకి వచ్చి చూసింది. పిల్లలందరూ చెట్లకింద భోంచేస్తున్నారు. తనే వెళ్లక తప్పింది కాదు – క్లాసు రూంలోకి.

టేబులు మీదే వున్నది పెన్ను. దాన్ని తీసుకుని వెనక్కి తిరగబోతూ ఉండగా, ఆ గదిలో ఎవరో ఉన్నట్టు అనిపించింది, అటుగా చూసింది. బెంచీలకు అవతల ఎవరో మూలకి తిరిగి భోంచేస్తూ ఉన్నారు.

ఇదేమిటీ వీడు క్లాసురూంలోనే ఏకంగా భోంచేస్తూ ఉన్నాడు ... "ఏమిటబ్బాయ్! అలా బయటకు వెళ్లి ఏ చెట్టుకిందనో చక్కగా భోంచేయ వచ్చుగా!" అంది.

టీచరు గొంతు వినగానే టక్కున లేచి నిలుచున్నాడా కుర్రాడు.

వాడు తిరుపాలేనని వెంటనే గుర్తించింది కళ్యాణి.

అయినా తప్పుచేసిన వాడిలా ఆ బిత్తరి చూపులేమిటీ.. నిన్నటినుంచీ తనంటే భయపడుతున్నాడా? తను అనవసరంగా ఆ కుర్రాడిని భయపెట్టేసిందా? అలా ఆలోచిస్తూనే వాడికి దగ్గరగా వెళ్లింది.

"ఎందుకలా ఉన్నావు?" అని అడుగుతూనే క్యారియర్ వైపు చూసింది, ఏం తింటున్నాడా అని.

అది బోసిగా ఉంది.

వాడు క్యారియర్ వైపూ, టీచర్ వైపూ చూశాడు.

"అంటే – నువ్వు భోజనం.."

"మా ఇంట్లో అందరూ ఒక్కపూట తినడానికే బత్యం లేవు టీచర్.. మీరు క్లాసులోకి రానియ్యరని ఉత్త క్యారియర్...." అంటూ కళ్లల్లో నీళ్లు రాలుస్తూ ఏడ్చేశాడు తిరుపాలు.

కళ్యాణి కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. ★